దుర్గంధం నుంచి విముక్తి

మన ఇంట్లో పోగయ్యే చెత్త నుంచి వచ్చే దుర్వాసననే భరించలేం. పక్కింటి నుంచి ఆ పరిస్థితి వస్తే.. వెంటనే వారికి చెప్పి, చెత్తను తొలగించాల్సిందిగా హెచ్చరిస్తాం. అలాంటిది ఎక్కడెక్కడి నుంచో వచ్చిన చెత్తనంతా.. మన ముక్కులకు తాకేంత దగ్గర్లో పోగేస్తే..! ఆ దుర్వాసనను తట్టుకోగలమా? వేపగుంట ప్రాంతంలోని చీమలాపల్లి, వరలక్ష్మినగర్ పరిసర కాలనీవాసులు దశాబ్దానికి పైగా ఇవే తిప్పలు పడ్డారు. గత ప్రభుత్వ చొరవతో సీసీఎస్ గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ నిర్మాణం జరిగి, వీరి ఇబ్బందులకు విముక్తి లభించింది.



నాడు: చీమలాపల్లి వద్ద ఆరు బయట వేసిన చెత్త



నేడు: రూ.11.22 కోట్లతో నిర్మించిన ఆధునిక డంపింగ్ యార్డు

- చీమలాపల్లి వద్ద అధునాతన డంపింగ్ యార్డు నిర్మాణం
- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రూ.11.22 కోట్లతో నిర్మించిన జీవీఎంసీ
- చీమలాపల్లి, వేపగుంట ప్రాంత వాసులకు భారీ ఊరట

పెందుర్తి: ఆరుబయట డంపింగ్ యార్డు ఇబ్బందుల నుంచి వేపగుంట ప్రాంతంలోని చీమలాపల్లి, వరలక్ష్మినగర్, సమీప కాలనీ వాసులకు విముక్తి లభించింది. ఏళ్ల తరబడి ఈ డంపింగ్ యార్డు వల్ల భరించలేని దుర్గంధం.. విపరీతమైన దోమలు, ఈగలతో ఇబ్బంది పడ్డారు. వాటి కారణంగా రోగాల బారిన పడ్డారు. ఎన్నాళ్ల నుంచో దీన్ని అక్కడి నుంచి తరలించాలని వినతులు, ఆందోళనలు చేపట్టారు. అప్పటి టీడీపీ ప్రభుత్వంలో ఎంతగా మొరపెట్టుకున్నా పట్టించుకున్న పాపాన పోలేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వీరి కష్టాలకు చెల్లుచీటీ పడింది.

ఆ తిప్పలు.. భరించలేనంత!

జీవీఎంసీ జోన్–8 పరిధిలోని వందలాది కాలనీల్లో సేకరించిన చెత్తనంతా 95వ వార్డు చీమలాపల్లి సమీపంలోని ఆరుబయలు డంపింగ్ యార్డులో పోగేసేవారు. ఈ చెత్త కుళ్లిపోయి విపరీతమైన దుర్గంధం వచ్చేది. వర్షం పడితే ఆ బాధ వర్ణనాతీతం. దీంతోపాటు దోమలు, ఈగలు పెరిగి స్థానికంగా నివాసం ఉండే వేలాది మంది ప్రజలు అవస్థలు పడేవారు. గత ప్రభుత్వంలో జీవీఎంసీ పాలకవర్గం కొలువుదీరగానే స్థానిక కార్పొరేటర్ ముమ్మన దేముడు దీనిపై ప్రత్యేక దృష్టి సారించారు. ఇక్కడి పరిస్థితిని జీవీఎంసీ మేయర్ గొలగాని హరి వెంకట కుమారికి, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. పరిస్థితిని స్వయంగా తెలుసుకున్న జీవీఎంసీ అధికారులు వెంటనే రూ.11.22 కోట్ల నిధులు విడుదలచేసి, నూతనంగా అధునాతన డంపింగ్ యార్డును నిర్మించారు.

ఈ డంపింగ్ యార్డు ప్రత్యేకతలు

- ఈ ఆధునిక డంపింగ్ యార్డులో రెండు భారీ గల్లాలు ఏర్పాటు చేశారు. జీవీఎంసీ వాహనాల ద్వారా తీసుకువచ్చిన తడి, పొడి చెత్తను వేర్వేరుగా వీటిలో వేస్తారు.
- ఇక్కడ రసాయన ప్రక్రియ వలన చెత్త నుంచి ఎక్కడా దుర్వాసన రాదు. దోమల వ్యాప్తి ఉండదు.
- ప్రాసెస్ చేసిన చెత్తను ఎప్పటికప్పుడు నగరంలోని కాపులుప్పాడలో ఉన్న జీవీఎంసీ ప్రధాన డంపింగ్ యార్డుకు తరలిస్తారు.
- ఈ యూనిట్‌ను ఇక్కడ ఏర్పాటు చేయడంతో స్థానిక ప్రజలకు ఎటువంటి కాలుష్యం గానీ, దుర్వాసన గానీ, ఇతర అనారోగ్యాలు గానీ తలెత్తే పరిస్థితి లేదు. దీంతో ప్రస్తుతం ఈ ప్రాంతవాసులు దుర్గంధం నుంచి విముక్తి లభించి హాయిగా ఊపిరి పీల్చుకుంటున్నారు.

ఎంతో ఊరటగా ఉంది



ఓపెన్ డంపింగ్ యార్డుతో ఏళ్ల తరబడి ఇబ్బందులు పడ్డాం. అక్కడి నుంచి వచ్చే దుర్వాసన, మురుగు నీరుకు దోమలు, ఈగలు ఎక్కువగా వృద్ధి చెందేవి. దీంతో తరచూ అనారోగ్యం పాలయ్యేవాళ్లం. ఇప్పుడు కొత్తగా డంపింగ్‌యార్డు యూనిట్‌ను నిర్మించడంతో ఆ ఇబ్బందులు తప్పాయి. మాకు ఎంతో ఊరటగా ఉంది.

– బొట్ట కృష్ణ, చీమలాపల్లి

ప్రజలకు ఎంతో మేలు



ఆరు బయట డంపింగ్ యార్డు వల్ల వచ్చే దుర్వాసనతో చాలా ఇబ్బందులు పడేవాళ్లం. ఎప్పటికప్పుడు రోగాల బారిన పడాల్సి వచ్చేది. భోజనం చేయాలన్నా ఆ దుర్వాసనకు సహించేది కాదు. ఇప్పుడు ఈ యార్డు నిర్మాణంతో ప్రజలకు ఎంతో మేలు జరిగింది. కార్పొరేటర్ ముమ్మన దేముడు చేసిన కృషి అభినందనీయం.

– బొడ్డు దేముడుబాబు, స్థానికుడు

క్లుప్తంగా

మణికంఠకు పంచామృతాభిషేకాలు



పెందుర్తి: సుజాతనగర్‌లోని పూర్ణ పుష్కల సమేత ధర్మశాస్త అయ్యప్పస్వామి దేవాలయంలో బుధవారం ప్రత్యేక పూజలు జరిపారు. పూర్ణదేవి, పుష్కలదేవి, ధర్మశాస్త, అయ్యప్పస్వామికి విశేష పంచామృతాభిషేకాలు చేశారు. అనంతరం విశేషాలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త వాకా చంద్రశేఖర్‌రెడ్డి చేతుల మీదుగా ప్రసాద వితరణ చేశారు.

నేడు భూలోకమాంబ పండగ



పరవాడ: పరవాడ గ్రామంలో కొలువు దీరిన భూలోకమాంబ అమ్మవారి పండగను స్థానిక సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. పండగలో భాగంగా గ్రామ ప్రజలు వేకువజాము నుంచే అమ్మవారిని దర్శించుకోనున్నారు. పండగను పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంలో మధ్యాహ్నం భారీ అన్నసమారాధన జరపనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని, తీర్థప్రసాదాలను స్వీకరించాల్సిందిగా కోరారు.

ఘనంగా కృష్ణాష్టమి ముగింపు వేడుకలు



శ్రీకృష్ణుడి సన్నిధిలో కూటమి నేతలు

పరవాడ: మండలంలోని నాయుడుపాలెం శివారు గొల్లపేట గ్రామంలో కొలువుదీరిన శ్రీకృష్ణుడి ఆలయంలో బుధవారం కృష్ణాష్టమి ముగింపు వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో పాల్గొన్న పరవాడ మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు, మండల టీడీపీ అధ్యక్షుడు వియ్యపు చిన్న తదితరులు శ్రీకృష్ణుడిని దర్శించుకుని, పూజలు జరిపి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన అన్నసమారాధనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఆటల పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో వియ్యపు ముత్యాలరావు, బాబూరావు, దుర్గ, అప్పలరాజు, అప్పడు నరసింహారావు, తాతారావు, దేముడు తదితరులు పాల్గొన్నారు.


నేడు వినాయక మట్టి ప్రతిమల పంపిణీ

సింహాచలం: వినాయక చవితిని పురస్కరించుకుని గురువారం మూడు వేల మట్టి గణపతి ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు 98వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు పీతల అప్పలరాజు, పీతల విష్ణుమూర్తి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వార్డు పరిధి సింహపురికాలనీ ప్రధాన ఆర్చ్ వద్ద ఉదయం 8 గంటల నుంచి విగ్రహాల పంపిణీ ప్రారంభమవుతుందన్నారు. స్థానికులు పాల్గొని, మట్టి ప్రతిమలను స్వీకరించాల్సిందిగా కోరారు.

ఘనంగా ఐఎన్‌ఎస్ సుమిత్ర 10వ వార్షికోత్సవం

సింధియా: తూర్పు నావికాదళానికి చెందిన పెట్రోలింగ్ వెసెల్ ఐఎన్‌ఎస్ సుమిత్ర 10వ వార్షికోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఈ నౌక పలు దేశాల్లో జరిగిన విన్యాసాల్లో పాల్గొంది. ఈ సందర్భంగా ఐఎన్‌ఎస్ సుమిత్ర టీమ్‌కి పలువురు నేవీ ఉన్నతాధికారులు శుభాకాంక్షలు తెలిపారు.

రైలు నుంచి పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి



గోపాలపట్నం: సింహాచలం రైల్వే స్టేషన్ రెండో ప్లాట్‌ఫారం శివారులో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. జీఆర్‌పీ ఎస్‌ఐ రవివర్మ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వేగంగా వెళ్తున్న రైలు నుంచి ప్రమాదవశాత్తు జారి పడడంతో గాయాలపాలై మృతి చెందినట్టుగా గుర్తించారు. రైలు నుంచి పడడంతో తలకు బలమైన గాయాలు, శరీరంలో రగుడు గాయాల కావడంతో మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. ఈ వ్యక్తి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. ఎవరైనా గుర్తిస్తే 99895 70010 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ రవి వర్మ కోరారు.

అగ్నిప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన

పరవాడ: అగ్ని ప్రమాదాలు, ప్రకృతి వైపరీత్యాలపై విద్యార్థులు అవగాహన పెంపొందించుకోవాలని అనకాపల్లి అగ్నిమాపక శాఖ అధికారి బి.నర్సింగరావు అన్నారు. పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ పాఠశాలలో అగ్నిప్రమాదాలు, ప్రకృతి విపత్తులు, లైఫ్ సేవింగ్ వంటి అంశాలపై బుధవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భాగంగా వంటింట్లో ఉన్న గ్యాస్ సిలిండర్ నుంచి మంటలు చెలరేగినప్పుడు వాటిని అదుపులోకి తేవడం, నీటిలో మునిగిపోకుండా లైఫ్ జాకెట్ ధరించడం వంటి అంశాలను వివరించారు. ఏదైనా అగ్నిప్రమాదం సంభవిస్తే తక్షణమే 101 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. అంతకు ముందు పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.సీతాలక్ష్మి మాట్లాడుతూ అగ్నిప్రమాదాలపై విద్యార్థులు తెలుసుకున్న అంశాలను ఇంటి వద్ద తల్లిదండ్రులకు కూడా అవగాహన కల్పించాలన్నారు. అగ్నిమాపక సిబ్బంది కె.లక్ష్మణరావు, ఎస్.ప్రసాద్‌రావు, కె.నానాజీ, సతీష్, శంకర్‌లను ప్రిన్సిపాల్ సీతాలక్ష్మి అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల సీఈవో నిశాంత్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



అగ్నిప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

విస్తంలో ముగిసిన 'హాక్‌థాన్'



హాక్‌థాన్‌లో పాల్గొన్న విద్యార్థులతో ప్రిన్సిపాల్ శివకుమార్, సిబ్బంది

పెందుర్తి: మండలంలోని వెల్ఫేర్ ఇంజినీరింగ్ కళాశాలలో రెండు రోజులుగా జరుగుతున్న హాక్‌థాన్ ఫర్ స్మార్ట్ ఇండియా–2024 బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ బీవీ శివకుమార్ మాట్లాడుతూ విద్యార్థుల్లో సాంకేతిక నైపుణ్యాన్ని వెలికితీసేందుకు ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. సీఎస్‌ఈ బ్రాంచ్ తరఫున సాఫ్ట్‌వేర్ విభాగం నుంచి 21, హార్డ్‌వేర్ విభాగం నుంచి 7 బృందాలు హాక్‌థాన్ పోటీల్లో పాల్గొన్నాయని తెలిపారు. రెండు రోజుల పాటు మొత్తం 100కు పైగా సమస్యలను పరిష్కరించినట్లు పేర్కొన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జి.ఆనందబాబు, డిప్లమా ప్రిన్సిపాల్ కె.వి.కిరణ్, సీఎస్‌ఈ విభాగాధిపతి ఎస్.సునీత, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

వరద బాధితుల కోసం విరాళాల సేకరణ

పరవాడ: విజయవాడ వరద బాధితులను ఆదుకోవడానికి దాతలు ముందుకు రావాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ కోరారు. సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక సినిమా హాలు కూడలిలో బుధవారం వరద బాధితుల సహాయ నిధి కోసం దాతల నుంచి విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల సంభవించిన తుపాను విజయవాడ ప్రజలకు తీవ్ర నష్టాన్ని మిగిల్చిందన్నారు. బాధితులకు మనమంతా అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కె.నాయుడు, జి.శ్రీనివాసరావు, సత్తిబాబు, లచ్చిబాబు, శ్రీను పాల్గొన్నారు.



దాతల నుంచి విరాళాలు సేకరిస్తున్న సీఐటీయూ కార్యకర్తలు

'పారిశుధ్యం, ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి'

సబ్బవరం: మండలంలోని పలు గ్రామ పంచాయతీలలో పారిశుధ్య నిర్వహణ, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను జిల్లా పంచాయతీ అధికారి శిరీష బుధవారం సందర్శించారు. బోదువలస, ఎల్లుప్పి, గుల్లేపల్లి పంచాయతీల్లో ఉన్న సంపద తయారీ కేంద్రాల నిర్వాహణను పరిశీలించారు. షెడ్‌లలోని వర్మీ కంపోస్టు పిట్‌లలో వానపాములను విడిచిపెట్టారు. అనంతరం షెడ్ పరిసరాలలో మొక్కలు నాటే కార్యక్రమాలను చేపట్టారు. గ్రామాల్లో పారిశుధ్య పనులను పరిశీలించి, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. పారిశుధ్యం, నీటి సరఫరా, ప్రజారోగ్యంపై పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కో ఆర్డినేటర్ నాగలక్ష్మి, ఈవోపీఆర్డీ మహేష్‌తో పాటు ఆయా గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



వర్మీ కంపోస్టు పిట్‌లో వానపాముల్ని విడిచిపెడుతున్న డీపీవో శిరీష, సిబ్బంది

'ఆస్తి పన్ను తగ్గింపు' అజెండాలో పెట్టండి

దాబాగార్డెన్స్: ఆస్తి పన్ను తగ్గింపు, ఆస్తి విలువ ఆధారిత పన్ను రద్దు, చెత్తపై యూజర్ చార్జీల రద్దు విషయమై జీవీఎంసీ కౌన్సిల్ సమావేశంలో అజెండాగా పెట్టాలని జీవీఎంసీ సీపీఎం ఫ్లోర్ లీడర్ డాక్టర్ బి.గంగారావు, సీపీఎం నగర కార్యదర్శి ఆర్.కె.ఎస్.వి.కుమార్ కోరారు. ఈమేరకు బుధవారం మేయర్ గొలగాని హరివెంకటకుమారికి వారు వినతిపత్రం అందజేశారు. ఈ నెల 10న నిర్వహించే సమావేశంలో ప్రస్తుత నివాస భవనాల ఆస్తి పన్ను పరిధి 0.13 శాతం నుంచి 0.10 శాతానికి, నివాసేతర భవనాలకు 0.30 శాతం నుంచి 0.20 శాతానికి తగ్గింపుకు తీర్మానం చేయాలని కోరారు. చెత్తపై యూజర్ చార్జీలు పూర్తిగా రద్దు విషయమై కూడా తీర్మానించాలన్నారు. రాష్ట్రంలో కొత్తగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆస్తి పన్ను తగ్గిస్తామని, సమీక్షిస్తామని, చెత్తపై యూజర్ చార్జీలు పూర్తిగా రద్దు చేస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో ప్రజలకు వాగ్దానం చేసిందన్నారు. ఈ ప్రతిపాదనలకు కౌన్సిల్‌లో ఉన్న కూటమి కార్పొరేటర్లు మద్దతిస్తారని భావిస్తున్నామని, వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు కూడా సీపీఎం ప్రతిపాదనలు బలపరుస్తారని ఆశిస్తున్నట్టు వినతిపత్రంలో పేర్కొన్నారు.



మేయర్ హరివెంకటకుమారికి వినతిపత్రం అందిస్తున్న గంగారావు

వరద బాధితులకు 'చారిటీ బాక్స్' సాయం

బీచ్‌రోడ్డు: విజయవాడ వరద ప్రభావిత ప్రాంతాల్లో ఆహారం సరఫరా చేస్తున్న అక్షయపాత్ర ఫౌండేషన్‌కు చారిటీ బాక్స్ స్వచ్ఛంద సంస్థ తమ వంతు సహాయం చేసింది. అక్షయపాత్ర కార్యాలయంలో సంస్థ ప్రతినిధి యదురాజా దాసకు బుధవారం చారిటీ బాక్స్ సభ్యులు రూ.11,116 చెక్కును అందజేశారు.

ఈ సందర్భంగా చారిటీ బాక్స్ కోశాధికారి పొట్నూరు వెంకట శివప్రసాద్ మాట్లాడుతూ వరద బాధితులకు ఆహారం అందించడం తక్షణ కర్తవ్యమన్నారు. ఆహారం పంపిణీలో భాగం కావాలని భావించి తమ సంస్థ తరఫున సాయంగా విరాళం అందజేశామన్నారు. మూడేళ్ల కిందట గోదావరి వరదల సమయంలో కూడా సహాయం చేశామని గుర్తుచేశారు. చారిటీ బాక్స్ ప్రతినిధి వెంకట రమణ మాట్లాడుతూ చేసే సాయం చిన్నదా, పెద్దదా అని ఆలోచించకుండా అది ఎంతవరకు అర్హులకు అందుతున్నదన్నదే ముఖ్యమన్నారు. ఇంతవరకు అలానే సేవా కార్యక్రమాలు చేస్తూ వచ్చామని చెప్పారు. కార్యక్రమంలో చారిటీ బాక్స్ అధ్యక్షుడు లక్కోజు నూకరాజు, సభ్యుడు కొంతం శ్రీకాంత్ పాల్గొన్నారు.



అక్షయపాత్ర సంస్థ ప్రతినిధికి చెక్కు అందిస్తున్న చారిటీ బాక్స్ సభ్యులు

ఉక్కు హెచ్‌ఆర్ అధికారి రాధికకు జాతీయ అవార్డు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్ డీజీఎం డాక్టర్ దాసరి రాధిక జాతీయస్థాయి జెండర్ డైవర్సిటీ అవార్డును అందుకున్నారు. ఇండియన్ స్టీల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం న్యూఢిల్లీలో జరిగిన ఇండియన్ కాంక్లేవ్ 2024లో ఆమెకు ఈ అవార్డును ప్రదానం చేశారు. స్టీల్‌ప్లాంట్‌లో క్లిష్టమైన జోన్లలో పని చేయడంతో పాటు సమ్మిళిత సంస్కృతిని కల్పించేందుకు ఆమె చేసిన కృషికి గుర్తింపుగా జెండర్ డైవర్సిటీ అవార్డును ప్రకటించారు. కేంద్ర ఉక్కుమంత్రిత్వ శాఖ మాజీ కార్యదర్శి నాగేంద్ర సిన్హా చేతుల మీదుగా ఆమె అవార్డును అందుకున్నారు. స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్ ఆమెను అభినందించారు.



కేంద్ర ఉక్కు మంత్రిత్వ శాఖ మాజీ కార్యదర్శి నాగేంద్ర సిన్హా చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న రాధిక

ఉత్తమ ఉపాధ్యాయినిగా విద్యావతి



సింహాచలం: ఉమ్మడి విశాఖ జిల్లా 98వ వార్డు పరిధి అడవివరానికి చెందిన ఉపాధ్యాయిని ఎస్‌టీపీ విద్యావతి జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయిని అవార్డుకు ఎంపికయ్యారు. ప్రస్తుతం ఆమె అనకాపల్లి జిల్లాలోని టి.అర్జాపురం ప్రైమరీ స్కూల్లో ఎస్జీటీగా పనిచేస్తున్నారు. 2021లో మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందారు. గురువారం అనకాపల్లి జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా విద్యావతి జిల్లా స్థాయి పురస్కారాన్ని అందుకోనున్నారు.

వీఎంఆర్‌డీఏ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్, అధికారులు, సిబ్బంది

విశాఖ సిటీ: వీఎంఆర్‌డీఏ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బుధవారం బాలల ప్రాంగణంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమాన్ని మెట్రోపాలిటన్ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ ప్రారంభించారు. అనంతరం ఆయన రక్తదానం చేసి దాని ఆవశ్యకతను వివరించారు. ఒకరు రక్తదానం చేయడం వల్ల ముగ్గురు ప్రాణాలను కాపాడిన వారవుతారని తెలిపారు. రక్తదాత ఆరోగ్యం కూడా మెరుగుపడుతుందన్నారు. కార్యక్రమంలో వీఎంఆర్‌డీఏ కార్యదర్శి దాట్ల కీర్తి, ఎస్టేట్ అధికారి లక్ష్మారెడ్డి, ముఖ్య గణాంకాధికారి హరిప్రసాద్, ఎస్‌ఈ బలరామరాజు, కార్యనిర్వాహక ఇంజినీర్ రామరాజు, రేంజ్ ఆఫీసర్లు శ్యామల, శివానీ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

బధిర విద్యార్థుల చేతుల్లో రూపుదిద్దుకున్న మట్టి వినాయకులు



మట్టి వినాయక ప్రతిమలు తయారు చేస్తున్న విద్యార్థులు

ఎంవీపీకాలనీ: పెదవాల్తేరు సన్‌ఫ్లవర్ స్కూల్ మూగ, చెవిటి విద్యార్థులు వినాయకుడి మట్టి ప్రతిమలను తయారు చేశారు. స్కూల్ ఆవరణలో బుధవారం ఈ కార్యక్రమం జరిగింది. పర్యావరణ పరిరక్షణపై స్కూల్ విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు స్కూల్ యాజమాన్యం ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. విద్యార్థులు చురుగ్గా పాల్గొని మట్టి ప్రతిమలను పెద్ద ఎత్తున తయారు చేసి ఆకట్టుకున్నారు. నగర ప్రజలంతా పర్యావరణ హితంగా మట్టి గణపతి ప్రతిమలను వినాయక చవితి వేడుకల్లో వినియోగించాలనే సందేశాన్ని ఇచ్చేందుకు విద్యార్థుల ద్వారా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు స్కూల్ ప్రిన్సిపాల్ కృష్ణవేణి తెలిపారు.

స్టీల్‌ప్లాంట్ నూతన అధికారులకు సత్కారం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ సెల్ ఇన్‌చార్జి, ఎస్సీ లైజన్ ఆఫీసర్లను స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ నాయకులు సత్కరించారు. ఎస్సీ, ఎస్టీ సెల్ ఇన్‌చార్జిగా ఎం.మధుసూదనరావు, ఎస్సీ లైజన్ ఆఫీసర్‌గా నల్లి సుందరం నూతనంగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా నాయకులు బుధవారం వారిని కలిసి తమ సమస్యలు వివరించారు. గత ఏప్రిల్ నుంచి పదవీ విరమణ చేసిన ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు రిటైర్‌మెంట్ బెనిఫిట్ స్కీం అమౌంట్ చెల్లించలేదన్నారు. ఈనెల 12తో ప్రస్తుత అసోసియేషన్ కమిటీ గుర్తింపు గడువు ముగుస్తున్నందున.. నూతన కమిటీ ఏర్పాటుకు ఎన్నికలు నిర్వహించాలని కోరారు. స్టీల్‌క్లబ్ సంయుక్త కార్యదర్శి జి.సురేష్, సీనియర్ నాయకులు కొమ్ము ప్రసాదరావు, బి.డేవిడ్, ఆర్.కోటేశ్వరరావు, బలరామ్, గోపాల్, చింతా మోహన్‌రావు, జె.కె.ఎస్.నాథన్, అరవింద్, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.